# అవధాన విద్య ఆరంభ వికాసాలు



డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్

# అవధాన విద్య - ఆరంభ వికాసాలు

పరిశోధకుడు

**రాళ్ళబండి వేంకటేశ్వర ప్రసాదరాజు**

M.A., B.Sc., B.Ed.,

పర్యవేక్షకులు

**డా॥ మసన చెన్నప్ప**

M.A., M.Phil., Ph.D

**తెలుగుశాఖ**

**ఉస్మానియా విశ్వవిద్యాలయం**

**హైదరాబాద్**

**ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' డిగ్రీ కోసం సమర్పించబడిన సిద్ధాంత వ్యాసం**

**2005**

## కై మోడ్పు

"అవధానవిద్య-ఆరంభవికాసాలు" సిద్ధాంతవ్యాసం రూపుదిద్దుకోవడానికి ఎందరెందరికో నేను కృతజ్ఞతాంజలులు సమర్పించాలి.

ముందుగా నా బాల్యంలోనే ఛందశ్శాస్త్రాన్ని-పద్యరచనను నేర్పి, ఎన్నెన్నో కావ్యాలు బోధించిన మా నాన్నగారు కీ.శే. రాళ్ళబండి రామకోటేశ్వర రాజుగారికి నా యీ సిద్ధాంతావ్యాసాన్ని ప్రణామాలర్పిస్తూ, వినమ్రంగా అంకితం చేస్తున్నాను.

డిగ్రీ సత్తుపల్లిలో చదివేటప్పుడు, నన్ను అన్వేషించుకుంటూ వచ్చి నన్ను పుత్రసమానునిగా భావించి అవధాన విద్యలో మెలకువలు నేర్పి నన్ను అవధానిగా తొలిసారి వేదిక నెక్కించిన కీ.శే. శ్రీమాన్ దూపాటి సంపత్కుమారాచార్యుల వారికి ప్రణమిల్లుతున్నాను.

గణితశాస్త్రంలో పట్టభద్రుణ్ణైన నాచే తెలుగులో ఎం.ఏ. చేయించి తన సునిశిత ప్రబోధనా పూర్వకమైన మాటలతో, చక్కని పరిశోధనా పద్ధతులు సూచిస్తూ, నాతో ఈ పరిశోధన పూర్తి చేయించి నా అవధానాలకు ఎన్నింటికో అధ్యక్షత వహించిన ప్రముఖ సాహిత్య విమర్శకులు ఉపనిషదనువక్త డా॥ మసన చెన్నప్పగారు నాకు పర్యవేక్షకులుగా ఉండడం నా అదృష్టం. వారికి ప్రత్యక్షర పూర్వక ధన్యవాదాలు.

ఆచార్య డా॥ కసిరెడ్డి వేంకటరెడ్డిగారు నా పరిశోధనలో జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి, ఎడనెడ తగు సూచనలు చేసినందుకు వారికి నిండు గుండెతో నమస్కరిస్తున్నాను.

నా పరిశోధనా కాలపరిమితిని పొడిగించిన ఆర్ట్స్ 'డీన్' ఆచార్య యన్.గోపి గారికి నా నమస్సుమనస్సులు అర్పించుకుంటున్నాను.

'నడుస్తున్న అవధానవిద్యా సర్వస్వం' అనదగ్గ శ్రీ రాపాక ఏకాంబరాచార్యుల వారి సొంత గ్రంథాలయం, వారి వ్యాసాలు ఈ పరిశోధనకు మంచి ఆకరాలుగా ఉపయుక్తమయ్యాయి. వారికి నా సాధువాదాలు సమర్పించుకొంటున్నాను.

ఈ వ్యాసంలో ఉటంకించిన కవులకు, అవధానులకు, విమర్శకులకు, పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు.

**రాళ్ళబండి వేంకటేశ్వర ప్రసాదరాజు**

# భూమిక

'దేశభాషలందు తెలుగులెస్స' అని శ్రీ కృష్ణదేవరాయలు తెలుగుభాషను వినుతించాడు. ఆ మహనీయుని పద్యసూక్తి ప్రత్యక్షరం సత్యమేనని సాధికారికంగా నిరూపించవచ్చు. పలుకుబడిలోగాని, కవిత్వంలోగానీ తెలుగుభాషకొక శక్తి ఉంది. "ప్రపంచపు పొలిమేరలు దాటవలసిన భాష" అని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ప్రపంచ తొలి తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన 'తెలుగువాణి'లో ఒక గొప్ప వ్యాసం వ్రాశారు. తెలుగు భాషతో ఎన్నో ప్రయోగాలు చెయ్యవచ్చు. ఎన్నో ప్రక్రియలు చేపట్టవచ్చు. ప్రతిభాషకు ఉన్న సాధారణశక్తులను మించిన అసాధారణమైన ప్రజ్ఞలను ప్రదర్శించడానికి పరిణాహం ఉన్న భాష తెలుగు భాష.

అలాంటి తెలుగు భాష మాట్లాడే జాతి గర్వించదగ్గ ప్రక్రియ అవధాన ప్రక్రియ. ఇది తెలుగు వారి సొంతం. ఈ అవధానవిద్య తెలుగు సంస్కృతిలో ప్రధానమైన అంతర్భాగం.

'అష్టావధానం', 'శతావధానం' అన్న పదబంధాలు తెలుగు భాషలో నుడికారాలుగా మారిపోయాయి. కష్టమైన పని చేసేటప్పుడు, ఒకేమారు ఎన్నో పనులు చేయవలసి వచ్చినప్పుడు ఈ నుడికారాలు వినపడుతుంటాయి. తెలుగులోని 'అవధానవిద్య' ఆరంభ వికాసాలను పరిశోధించడమే లక్ష్యంగా నా యీ సిద్ధాంతవ్యాసాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. 1. అవధాన విద్యా స్వరూపం – చరిత్ర; 2. అవధానవిద్య – ప్రక్రియా వైవిధ్యం; 3. అవధానాంశాలు – పరిశీలన; 4. అవధానంలో కవిత్వాంశ; 5. అవధాన వివాదాలు; 6. పర్యాలోకనం.

అవధాన విద్య సాహిత్యరంగానికే పరిమితం కాదు. సాహిత్యేతర రంగాలలో కూడా అవధానవిద్యను అనువర్తించవచ్చు.

17వ శతాబ్దం నాటికే 20 రకాల అవధానాలున్నట్లు 'ప్రబంధ రాజవేంకటేశ్వర విజయవిలాసం'లో గణపవరపు వేంకటకవి' తెలియజేశాడు.

"అమితాశువు, మధురము, చి
త్రము, విస్తారము చతుర్విధ కవితలను చి
త్రముగ వింశత్యవధా
నములన్ ఘటియించు లక్షణకవి వరుండన్" (అవతారిక-43 పద్యం)

అంతకు ముందు ఐదువందల ఏండ్లు అంటే క్రీ.శ. 1285 నాటికి జక్కన తాత పెద్దయామాత్యులు "ఎవ్వడే యవధానమెఱుగు నయ్యవధానమున వాని కించుకముల్లుసూపనేర్తు"నని చెప్పుకొన్నాడు. అంటే ఇప్పటికి 750 ఏళ్ల క్రితమే ఎన్నో అవధానాలుండేవి. కాని అవి చాలా వరకు మరుగున పడిపోయ్యాయి. కాని "అష్టావధానం", "శతావధానం" మాత్రం నిత్యనూతనాలై కాలానుగుణంగా మార్పులు చెందుతూ పండిత పామరుల్ని అలరిస్తూనే ఉన్నాయి. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలోను, కొరవిగోపరాజు సింహాసన ద్వాత్రింశకలోను 'అష్టావధాన' ప్రసక్తి ఉంది. ఆ వివరాలన్నీ పరిశీలించే సమగ్ర ప్రయత్నం ఈ సిద్ధాంత వ్యాసంలో జరిగింది.

ఇక శతావధానాన్ని గూర్చి చెప్పుకున్నప్పుడు క్రీ.శ. 1285 ప్రాంతంలో కాకతి ప్రతాపరుద్రుని ఆస్థానంలోని కొలచల్మ మల్లినాథుడు తొలి సంస్కృత శతావధానిగా కనిపిస్తాడు. క్రీ.శ. 1550 ప్రాంతానికి చెందిన రామరాజభూషణుడు విభిన్న అవధాన ప్రజ్ఞల సమాహారంగా కనిపిస్తాడు. ఆ తర్వాత ఎందరెందరో అవధానులు తమ వైదుష్యాని అవధానవిద్యలో ప్రదర్శించారు.

ఇప్పటి వరకు అవధాన చరిత్రలో 50 రకాల అవధానాలు నమోదైనాయి. అష్టావధానం ఆరంభంలో ఉన్న ఎనిమిది అంశాలు క్రమేపీ వికాసం చెంది 50 అంశాలుగా పెరిగాయి. శతావధానాలలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. క్రీ.శ. 1870 ప్రాంతంలో శ్రీ మాడభూషి వేంకటాచార్యుల వారి నుంచి ఈనాటి దాకా అవధానాలలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకొన్నాయి. వాటినన్నింటినీ సమగ్రంగా ఈ సిద్ధాంత వ్యాసంలో చర్చించడం జరిగింది.

సహస్రావధానాల విషయంలో చూస్తే క్రీ.శ. 1760 ప్రాంతంలో శ్రీ ప్రతివాద భయంకర వీరరాఘవాచార్యులు చేసిన సహస్రావధానం నుంచి ఇటీవలన జరిగిన సహస్రావధానాల వరకు కనిపించే తీరు తెన్నులు గూడా ఇందులో వివరించడం జరిగింది.

అవధానాంశాలైన సమస్యాపూరణం, దత్తపది, నిషేధాక్షరి వంటి 50 రకాల అంశాలను సోదాహరణంగా ఇందులో అనుశీలించడం జరిగింది.

అవధానాల్లో విశేషంగా కనిపించే అపూర్వవర్ణనా నైపుణ్యం, స్వీయకవిత్వ ముద్ర, భావుకత, అలంకార ప్రయోగనైపుణ్యం, చమత్కారం-చాటుకవితాస్ఫూర్తి" అనే ప్రతిభా పంచకాన్ని "అవధానంలో కవిత్వాంశ" అనే అధ్యాయంలో చర్చించడం జరిగింది.

అవధాన చరిత్రలో ఎన్నో వివాదాలు నమోదైనాయి. తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు సోదర కవులకు, వేంకట రామకృష్ణ కవులకు ఇతర కవులకు మధ్యన ఎన్నో వివాదాలు తటస్థించాయి. ఇతర అవధానులలో కూడా ఎన్నో వివాదాలున్నాయి. ఆ వివాదాల వల్ల అవధానవిద్యకు వికాసమే కల్గింది. ఎంతో సాహిత్య సృష్టి కూడా జరిగింది. ఆ వివరాలనన్నింటినీ సేకరించి పరిశోధనలో విశ్లేషించడం జరిగింది. ఆధునిక అవధాన వివాదాల విశేషాలు కూడా ఈ పరిశోధనలో ప్రకటించబడ్డాయి.

అవధానవిద్య యొక్క భవిష్యత్తును ఆధునిక పద్ధతిలో 'స్వాట్' ఎనాలసిస్ ద్వారా అనుశీలించి అవధానవిద్య "పర్యావలోకనం" చేయడం జరిగింది.

గతంలో 'అవధానవిద్య'పై పరిశోధించి డా॥ సి.వి. సుబ్బన్నగారు మైసూరు విశ్వవిద్యాలయం నుంచి, పిహెచ్.డి. డిగ్రీ పొందారు. అలాగే "ఆంధ్రం-అవధాన ప్రక్రియ" అంశంపై డా॥ కంభంపాటి రామ గోపాల కృష్ణమూర్తి గారు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. డిగ్రీ పొందారు. అనంతర కాలంలో జరిగిన అవధానాలమీద ఈ పరిశోధన కేంద్రీకరించింది. ఈ సిద్ధాంత వ్యాసంలో అవధాన విద్య ఆరంభ వికాసాలపై వీలయినంత ఎక్కువ సమాచారాన్ని అందించే ప్రయత్నం చేశాను. ఇందుకు గాను ఎన్నో పుస్తకాలు సేకరించి, అధ్యయనం చేయడమేకాక పెద్దలను, పండితులను, అవధానులను కలిసి చర్చించి సమాచారాన్ని సేకరించడం జరిగింది.

నమూనా అష్టావధానాలుగా ప్రాచీన కాలంలో శ్రీ పళ్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులు గారు 1943లో గుంటూరులో చేసిన అష్టావధానాన్ని, 1985 ప్రాంతంలో శ్రీ మేడసాని మోహన్ చేసిన అష్టావధానాన్ని అలాగే ఒక ఊహాత్మకమైన ఇంగ్లీషు అష్టావధాన నమూనాను అనుబంధాలలో చేర్చడం జరిగింది.

లభించిన అవధానాల ఆధారంగా అవధానుల జాబితాను, ఇతర అవధానుల వివరాలను పొందుపరచాను. ప్రముఖులైన అవధానుల చిత్రపటాలను కూడా అనుబంధంలో చేర్చడం జరిగింది.

'అవధానవిద్య'పై వినూత్న దృక్కోణంతో వెలువరింపబడిన పరిశోధన గ్రంథంగా మనవి చేస్తూ నా ఈ సిద్ధాంత వ్యాసంలోకి ఆహ్వానిస్తున్నాను.

**రాళ్ళబండి వేంకటేశ్వర ప్రసాదరాజు**

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | కైమోడ్పు | – | iv |
| | భూమిక | – | v |
| **1.** | **ప్రథమాధ్యాయం** | – | 1-27 |
| | **అవధాన విద్యాస్వరూపం - చరిత్ర** | | |
| | అవధాన శబ్ద విచారం | – | 1 |
| | అవధాన శబ్ద చరిత్ర | – | 2 |
| | వేదావధానం-అష్టావధానం | – | 6 |
| | స్వరావధానం | – | 6 |
| | అక్షరావధానం | – | 7 |
| | అవధాన శక్తులు | – | 12 |
| | అవధాన యుగవిభజన | – | 22 |
| | ఆరంభంలో అవధాన ప్రదర్శనల చరిత్ర | – | 22 |
| | అవధాన విద్యా లభ్యత | – | 23 |
| | విభిన్నావధానాలు | – | 23 |
| **2.** | **ద్వితీయాధ్యాయం** | – | 28-81 |
| | **అవధాన విద్య - ప్రక్రియా వైవిధ్యం** | | |
| | అష్టావధానం ఆరంభ వికాసాలు | – | 28 |
| | అష్టావధాన స్వరూపం - ఆరంభదశ | – | 28 |
| | అష్టావధానం విభిన్నాంశాల వికాసం | – | 29 |
| | అష్టాదశావధానం | – | 36 |
| | శతావధానం ఆరంభవికాసాలు | – | 38 |

శతావధాన నిబంధనలు - 45
ఆధునిక శతావధానాలు - 46
శతావధానం - నాడు - నేడు - 46
శతావధాన ప్రయోగాలు - 48
సహస్రావధానం - ఆరంభ వికాసాలు - 49
పంచసహస్ర పత్రావధానం - 53
ఆధునిక సహస్రావధానాలు - 54
సహస్రావధానంలో ధారణ - 58
సహస్రావధాన కార్యక్రమం - సంయోజకత్వం - 60
సహస్రావధానంలో పృచ్ఛకులు - 60
అవధాన ప్రయోగాలు - 61
నవరస నవావధానం - 61
అలంకార అష్టావధానం - 61
సాహిత్య ప్రక్రియావధానం - 61
వచన కవితావధానం - 62
ధారణావధానం - 62
హాస్యావధానం - 62
కావ్యావధానం - 63
సాహిత్యేతరావధానాలు - 63
**ధారణా సంబంధావధానాలు** - భగవద్గీతావధానం - సహస్రనామావధానం - రామాయణావధానం - శతకలశావధానం శబ్దావధానం - 64
**సాంకేతికావధానాలు** - నేత్రావధానం - పుష్పావధానం - శుష్కావధానం- తృణావధానం - గమనావధానం - ఖడ్గావధానం - భూజావధానం - భ్రూకళావధానం - హస్తావధానం - అంగుష్ఠావధానం - ఘంటావధానం- చక్రావధానం - అక్షరముష్టికావధానం - 65
**శాస్త్రసంబంధావధానాలు** - గణితావధానం - జ్యోతిషావధానం - వైద్యాష్టావధానం - అక్షర గణితావధానం - - 70
**కళాసంబంధావధానాలు** - నాట్యవధానం - సంగీతాష్టావధానం - ధ్వన్యనుకరణావధానం - ధ్వన్యవధానం - చిత్రకళావధానం - 73
ప్రత్యేకావధానాల ప్రసక్తి - 78

**3. తృతీయాధ్యాయము - 82-204**

**అవధానాంశాలు - పరిశీలనం**
సమస్యాపూరణం - 82
సమస్యాపూరణల వర్గీకరణ - 83
సహస్రావధాన సమస్యలు - పూరణలు - ఒక విశ్లేషణ - 118
దత్తపది - 119
నిషేధాక్షరి-నిషిద్ధాక్షరి-వివర్గాక్షరి - 126
వర్ణన -కవిత్వం - 134
సహస్రావధాన వర్ణన - ఛందో విశ్లేషణ - 145
న్యస్తాక్షరి - 146
వ్యస్తాక్షరి - 149
ఘంటాగణనం - 151
పుష్పగణనం - 151
ఛందోభాషణం - 152
కావ్యోక్తి -కావ్యపాఠం -కావ్యవ్యాఖ్య -పురాణం -పురాణోక్తి - 154
సహపఠనం - 155

శాస్త్రార్థం -వైయాకరణ శాస్త్రార్థం - 155
వ్యస్తపాది -వ్యత్యస్తపాది -ఇచ్ఛాంకశ్లోకం - 153
వృత్తమాలిక - 156
శ్లోకాంధ్రీకరణ -నిర్దిష్ట భావానువాదం - 156
ఆకాశ పురాణం - 157
చిత్రకథ - 158
నిషిద్ధ గమన కథనం - 158
కావ్యానుకరణం (పేరడీ) - 159
వచన కవిత / మినీ కవిత - 160
పాట – గేయం – జావలి – కీర్తన – సంగీతం – నృత్తపది – 161
అన్యభాషోపన్యాసం - 163
అప్రస్తుత ప్రసంగం–అప్రస్తుత ప్రశంస–లౌకిక ప్రసంగం–చమత్కార భాషణం - 164
ఏక సంధాగ్రహణం - 165
అక్షర విన్యాసం - 169
యాంత్రిక గణితం–మ్యాజిక్ స్క్వేర్ - 173
వారగణితం / పంచాంగ గణనం - 176
మనోగణితం - 176
చీట్లాట–చదరంగం–అశ్వప్లుతం–క్యారమ్స్ - 179
లిఖితాక్షరి - 180
అంత్యాక్షరి - 181
నామసమీకరణం–రాగసమీకరణం - 181
ఆశువు - 182
ఉద్దిష్టాక్షరి–చిత్రాక్షరి - 194
నిర్దిష్టాక్షరి - 195
అవధానాంశాల జాబితా - 197

**4. చతుర్థాధ్యాయము** - 205–244

**అవధానాలు కవిత్వాంశ**

కవి–కవిత్వం - 206
అవధానం – పద్యశిల్పం - 208
1. అపూర్వ వర్ణనా నైపుణ్యం - 209
2. స్వీయ కవిత్వముద్ర - 214
3. భావుకత - 218
4. అలంకార ప్రయోగ నైపుణ్యం - 223
5. చమత్కారం – చాటు కవితా స్ఫూర్తి - 231

**5. పంచమాధ్యాయం** - 245–286

**అవధాన వివాదాలు**

వివాదాల చరిత్ర - 246
తిరుపతి వేంకట కవుల అంతర్గత వివాదాలు - 248
తిరుపతి వేంకట కవులు – ఇతర కవులతో వివాదాలు - 250
పిసుపాటి చిదంబర శాస్త్రి ఆదిపూడి ప్రభాకరరావు గార్ల వివాదం – 253
కొప్పరపు కవులు – తిరుపతి వేంకట కవులతో వివాదం - 259
వేంకట రామకృష్ణ కవులు – తిరుపతి వేంకట కవులతో వివాదం – 276
కాశీ కృష్ణాచార్యుల అవధాన వివాదం - 281
ఆదిభట్లనారాయణదాసుగారి అవధాన వివాదం - 282

| | | | |
|---|---|---|---|
| | అత్యాధునికావధానాలు – వివాదాలు | – | 283 |
| **6.** | **షష్ఠమాధ్యాయం** | – | 287–290 |
| | **పర్యాలోకనం** | | |
| | "స్వాట్" విశ్లేషణ | – | 288 |
| | అవధాన విద్య – సుగుణాలు | – | 288 |
| | పరిమితులు | – | 288 |
| | వినియోగావకాశాలు | – | 289 |
| | సవాళ్లు | – | 289 |
| | అవధాన విద్యాపీఠం | – | 290 |
| | అవధానుల బాధ్యతలు | – | 291 |
| **అనుబంధాలు** | | – | i-xlv |
| 1. | "స్వాట్" అనాల్సిస్ | – | i |
| 2. | ప్రాచీనావధానం – (1) | – | ii |
| | ఆధునిక అవధానం – (2) | – | vii |
| | 'ఇంగ్లీషు' అవధానం నమూనా – (3) | – | xi |
| 3. | అవధానుల చిత్రపటాలు | – | xv |
| 4. | అవధానుల పట్టిక | – | xxi |
| 5. | ప్రసక్త గ్రంథ సూచిక | – | xli |

# 1. అవధాన విద్యా స్వరూపం - చరిత్ర

లలితకళలు ఐదు – కవిత్వం, సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం. వీనిలో కవిత్వం అత్యుత్తమం. "విద్యల లోపల ఉత్తమవిద్య కవిత్వం"[1] ఆ కవిత్వాన్ని ప్రదర్శనాత్మకమైన కళగా సాహిత్యరంగంలో అవధాన ప్రక్రియ తీర్చిదిద్దింది.

## అవధాన శబ్ద విచారం :

'అవధానం' అన్న పదం తెలుగు, సంస్కృత భాషలలో ప్రయుక్తమౌతూనే ఉంది.

'డు' ధాఞ్ ధారణ పోషయోః' అను ధాతువునకు 'అవ' అను ఉపసర్గను చేర్చి 'ల్యు' దంతము చేయగా అవధాన పదం నిష్పన్నమౌతుంది.[2]

'అవధానం' పదం 'వధానము' అని కూడా ప్రయోగంలో ఉంది. అది వ్యాకరణ సమ్మతమే.

'వష్టివాగురి రల్లోప మవాప్యో రుపసర్గయోః'[3] అని కారిక. ఉపసర్గయందలి మొదటి అకారం లోపిస్తుంది. 'అవధానం' 'వధానం' అవుతుంది. 'అవలగ్నం' – 'వలగ్నం'; 'అవసంతం' – 'వసంతం' – 'అపిధానం' – 'పిధానం' పదాలుకూడా ఇదే వ్యాకరణ సూత్ర సమ్మితాలు.

ఈ విషయమై 1914 వేంకటగిరి సంస్థానంలో 'వధాన' పదంపై చర్చ జరిగినపుడు పిసుపాటి చిదంబర శాస్త్రి గారు ఒక పద్యం చెప్పారు.

"అపియని, యవఅని, వెలసిన
ఉపసర్గంబుల యకారమూడునటంచున్
ప్రపఠించె భాగురి మహ
ర్షి, పాణిని మహర్షి అటులచెప్పడు భూపా!"[4]

'చిత్తైకాగ్ర్యం అవధానం' అని వామనుడు సూత్రీకరించాడు.[5]

అనగా చిత్తము యొక్క ఏకాగ్రతే అవధానం.

చిత్తమునకు ఐదు భూమికలుంటాయి. క్షిప్తం, మూఢం, విక్షిప్తం, ఏకాగ్రం, నిరుద్ధం.[6] ఈ ఐదు భూమికలలో ఏకాగ్ర భూమికలో చిత్తం సమాధి స్థితిలో ఉంటుంది. ఏకాగ్రం అంటే ఏకమాత్రావలంబనం కలిగి ఉండడం. చిత్తం ఒక విషయంపై శక్తిని కేంద్రీకరించే స్థితి ఏకాగ్రత. అట్టి స్థితిని "అవధానం" అన్నారు.

అమరకోశంలో "అవధానం – సమాధానం – ప్రణిధానం తథైవచ' అని, 'ప్రమాదోఽ నవధానతా'[7] అని నిర్వచితము. అంటే అనవధానతయే ప్రమాదము. అప్రమత్తతయే అవధానం.

చేస్తున్న పనిపట్ల ఏకాగ్రంగానూ, అప్రమత్తంగాను, ఉండే చిత్తస్థితియే అవధానం. ఈ అర్థంలోనే అవధానశబ్దం సంస్కృత వాఙ్మయంలో ప్రయోగింపబడింది.

అవధానం చతుష్షష్టికళలలో కూడా పేర్కొన్నారు. కొఱవిగోపరాజు సింహాసన ద్వాత్రింశకలో 'అష్టావధానం' 64 కళల జాబితాలో ఒకటిగా పేర్కొనడం విశేషం.[8]

'అవధానాదర్శం'లో –

చిత్తైకాగ్ర్యమిహావధానముదితం దేశే వివిక్తే తథా
రాత్రౌతత్సమ వాప్యతే సుకృతిభిః కాలేతురీయేపునః
అభ్యాసేసతి దేశకాలనియమోప్యాస్తా న్నిరస్తస్స్వయం
సైషాయోగవిదశ్చిదంబరకవే రాత్మానుభూతి స్ఫృతిః[9]

అనగా

"అవధానస్థితి – ఏకాంత ప్రదేశంలో, రాత్రివేళ, నాల్గవ యామంలో సుకృతులకు సిద్ధిస్తుంది. అయినా అభ్యాసము వలన దేశకాల, నియమాలు అక్కర లేకుండానే అవధాన స్థితిని చేరుకోవచ్చు. అది కవుల స్వానుభవం".

శబ్దార్థ కల్పతరువులో 'అవధానం' అంటే మనోయోగం అని అర్థం ఉంది. యోగం అంటే కలయిక. ఇక్కడ మనస్సు – ఒకే విషయంతో కలిసి ఉండే స్థితి అవధానం అని అర్థం చెప్పవచ్చు.



## అవధాన శబ్ద చరిత్ర :

కిరాతార్జునీయంలో

కృతావధానం జితబర్హిణధ్వనే సురక్త గోపీజన గీత నిస్స్వనే
ఇతం జిఘత్సా మపహాయ భూయసీం, నసస్యమభ్యేతి మృగీకదంబకం[10]।

"పాటవినడంలోని ఆసక్తితో, ఆకలిని కూడా లెక్కచేయని స్థితిలో లేళ్ల గుంపు ఉంది. ఆ స్థితిని కూడా 'అవధానం' అన్న పదబంధంతో భారవి కవీంద్రుడు వ్యక్తీకరించాడు. ఇక తెలుగు సాహిత్యంలో కూడా అవధానశబ్దం ఏకాగ్రతా పరంగానే ప్రయోగింపబడింది.

శ్రీమదాంధ్ర మహాభారతంలో నన్నయ భట్టారకుడు 'దత్తావధానులై వినుండు"[11] అని

తిక్కన శాంతిపర్వంలో "అవధానంబుతో నవధరింపుడు"[12] అని అవధానశబ్దం ఏకాగ్రత అనే అర్థంలో ప్రయుక్తమైంది.

ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వంలో

అతులిత విష్ణుశక్తి సముపాహిత మూర్తివి గమ్ములెమ్ము, సం
తత భుజశక్తి నిట్టి "యవధాన మొనర్పగ" నీవ కాని, ఈ
క్షితినితరుండు లేడధిక కీర్తియు బుణ్యము జేరు నిన్ను నూ
ర్జితగుణ యింతవట్టి దగ జేయుము, కావుము లోకమంతయున్.[13]

ఈ పద్యం దుంధుడు అనే రాక్షసుణ్ణి సంహరించమని బృహదశ్వుణ్ణి, ఉదంకుడు వేడుకొనే సందర్భంలోనిది. ఈ పద్యంలో 'అవధానం' అనే పదం కేవలం ఏకాగ్రతాపరంగా వాడలేదు. ఒక బృహత్కార్యం నెరవేర్చే స్థితికి వాడడం విశేషం. అంటే అప్రమత్తంగా నెరవేర్చే పనికి పర్యాయ పదంగా తెలుగు సాహిత్యంలో తొలిసారి ప్రయుక్తమైంది.

సంస్కృత భారతంలో అరణ్యపర్వంలోని దుందుమారోపాఖ్యానంలో 194వ అధ్యాయంలో ఈ సన్నివేశంలో 'అవధానం' అన్నపదం లేదు. ఎఱ్ఱన తను సొంతంగానే ఈ పదాన్ని ఈ అర్థంలో ప్రయోగించాడు.

'చిత్రాంగదచరిత్ర' రచించిన పైడిమఱ్ఱి వేంకటపతి పూర్వులలో ఒకనికి కృష్ణరాయభూషణుడు అనే బిరుదున్నదని, వేంకటాద్రి కృతమైన ఈ పద్యంలో తన నలుగురు అన్నలలో కేశవన్న అనే తన సోదరుడు అవధాని అని పేర్కొనబడింది.

సకల, సత్కవిపూజ్య సుకవిత్వ సామ్రాజ్య
నిర్వాహకుడు పెద్ద పర్వతన్న,
వివిధ భాషాచార్య విరచనా చాతుర్య
సర్వంకషుడు బోడి పర్వతన్న,
వరపద్య దాకార వాచా చమత్కార
నిరుపమ మతిశాలి తిరుమలన్న
"యవధానకృతి గర్భకవితాచ్ఛసందర్భ
కీర్తిత ప్రజ్ఞుడు కేశవన్న
దనకునన్నలు గాగ దనరు కృష్ణ
రాయభూషణకులరామరాజతనయ
కేశవాత్మజ పర్వతాధీశు వేంక
టాద్రి నిదె కావ్యమేనిత్తునంకితమ్ము". [14]

శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యంలో

"శివరాత్రి పుణ్యకాలంబున ..... పురాణంబులు వినిపించువారు ..... ఇతిహాసంబులు చదువువారు ..... 'అష్టావధానంబుల' క్రీడించువారు .... జాగరంబులు సలుపు చుండిరి"[15] అని వ్రాశాడు.

అంటే శ్రీనాథుని కాలం నాటికే అష్టావధానం ప్రజా బాహుళ్యంలో ప్రాచుర్యంలో ఉంది. అది జాగరణాల్లో భక్తులు నిద్రరాకుండా, భగవత్సన్నిధిలో, పవిత్రబుద్ధితో చేసే వినోద ప్రక్రియ అని తెలుస్తుంది.

ఇక, తెనాలి రామకృష్ణుడు ఉద్భటారాధ్య చరిత్రలో "అవధానంబున నుండి శంకర కథావ్యాసక్తి భాసిల్లుచున్"[16] ఇక్కడ అవధానం ఏకాగ్రతాపరంగానే ఉంది.



పుష్పగిరితిమ్మన తన శతకత్రయ గద్యలో "శ్రీమదంజనాతనయ దయారసలసత్కటాక్ష వీక్షామహత్త్వ సంప్రాప్త "కవిత్వవిద్యావధానకవి"[17] అని చెప్పుకొన్నాడు. "కవిత్వ విద్యావధాన కవి" ఒక కొత్త ఆలోచన రేకెత్తించే పదబంధం. అంటే కవిత్వవిద్యలో కాక ఇతర విద్యలలోకూడా అవధానం ఉన్నదనే విషయం స్పష్టమౌతుంది.

ఇక అవధానాన్ని ప్రక్రియా పరంగా చరిగొండధర్మన్న 'శతలేఖిన్యవధాన పద్యరచనా, సంధా సురత్రాణ చిహ్నితనాముడు' అని చెప్పుకున్నాడు ఈ క్రింది పద్యంలో.

"శతలేఖిన్యవధాన" పద్యరచనా సంధాసురత్రాణ చి
హ్నితానామా! చరికొండ ధర్మసుకవీ! నీ వాగ్విలాసంబులా
శితి కంఠోజ్వల జాటకోటర కుటీశీతాంశురేఖాసమా
న్విత గంగాకనకాబ్ధ నిర్ఝర రసావిర్భూత మాధుర్యముల్". [18]

విక్రమార్కచరిత్ర రచించిన జక్కన తాత పెద్దయ్య (క్రీ.శ. 1285) కాలంలో అవధానాలు చాలా రకాలుగా ఉన్నాయి. అన్నింటిలో తాను దిట్టను అని చెప్పుకున్నాడు.

ఈ పెద్దయామాత్యునికి శక్తియుక్తులు చాలా ఉన్నాయి. అందులో ఎవరే అవధానం చూపినా ఆ అవధానాన్ని ఇతడు చేస్తానన్నాడు. అంతేకాదు వారి అవధానాన్ని మించుతానని అంటాడు. ఇతడు అనేక ప్రతిభల సమాహారం. పెద్దయామాత్యుని శక్తి యుక్తుల పూర్తి పద్యమిది.

సంస్కృత ప్రాకృత శౌరసేన్యాదుల
గడియలోనొక శతకంబు జెప్ప (ఆశుకవితాశక్తి)
ప్రహసన, ప్రకరణ, బాణాది బహువిధా
రూపకంబుల యందు రూఢిమెరయ (దశరూపక నిర్మాణశక్తి)
జక్క చతుర్భద్ర చతురుత్తరాధిక
క్షుద్రకావ్యముల పెక్కులు రచింప (చతుర్విధ కవితాశక్తి)

నాంధ్రకవిత్వంబు నందు బ్రబంధంబు
మేలుగా దఙ్ఞలు మెచ్చజెప్పు
(ఆంధ్ర ప్రబంధ నిర్మాణ శక్తి)
నిమ్ముల నేరీతి నేధాతువునకేమి
నవరసములను వర్ణనలు సేయ
(ధాతుపరిజ్ఞానం, రసపరిజ్ఞానం)
సరినేకసంథా ద్విసంథా త్రిసంథల
దొడరిన బొరిబొరి గడవజదువ (ధారణా శక్తి)
"నెవ్వడేయవధాన మెరుగునయ్యవధాన
మున వానికించుక ముల్లుసూప "
(వివిధావధాననిర్వహణాశక్తి)
వృత్తకందముల కందవృత్తములును చతు
ష్కందంబు మొదలుగా గలుగు గర్భ
కావ్యవర్గము చెప్ప గద్యప్రబంధముల్
కొత్తలు పుట్టించుకొని లిఖింప
గా, నక్షరచ్యుతకంబు మాత్రాచ్యుత
కంబు బంధచ్యుతకంబు నామ
గోప్యంబులును, క్రియాగోప్యంబులును, భావ
గోప్యంబులును జెప్పగోష్ఠియందు (విభిన్నచిత్ర కవితాశక్తి)
బద్యంబు గీతి నార్భటమున జదువంగ
నెల్లవిద్యల సంచులెఱుగ నేర్తు (పద్యపఠనశక్తి)
వనుచు నెల్లూరి తిరుకాళమనుజవిభుని
సమ్ముఖంబున సాహిత్య సరణిమెరసి
మహిమ గాంచిన పెద్దయామాత్యసుకవి
మనుమడవునీవు నీ వంశమహిమయొప్పు.[19]

"ఎవ్వడే యవధానమెరుగునయ్యవధానమున వాని కించుకముల్లుసూప" నేర్తునన్నాడు. అంటే క్రీ.శ. 1285 నాటికి వివిధములైన అవధానములున్నట్లు స్పష్టం.



రామరాజభూషణుడు (భట్టుమూర్తి) (క్రీ.శ. 15వ శతాబ్దం) 'సకల భాషావిశేష నిరుపమానావధాన[20] శారదామూర్తి'ని అని చెప్పికొన్నాడు.

క్రీ॥శ॥ 1550–1600 ప్రాంతంవాడైన శ్రీ పట్టమట్ట సోమనాథ సోమయాజి తన 'సూతసంహిత'లో తన గురించి ఇలా చెప్పుకున్నాడు.

"ఘటికాశత గ్రంథ ఘటన ముఖ్య కవిత్వ
నానావిధానావధానరూఢి".[20ఎ]

ఈయన వివిధరకములైన అవధానాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

మరింగంటి సింగరాచార్యులు 'శతఘంటావధానప్రసిద్ధులు'.[21]

హరిభట్టుకు అష్టఘంటావధాని యనే విశిష్టమైన బిరుదు ఉన్నది.[22]

'రేటూరి రంగరాజు' అష్టావధాన కలిత శతలేఖినీ పద్య గద్య శక్తి సాటి మీరినవాడు అని చెప్పుకున్నాడు.[23]

క్రీ.శ. 1660 ప్రాంతంలో చింతపల్లి వీర రాఘువ కవి వివిధావధానాలు చేసినట్లు పాలమూరు అవధానాలలో పేర్కొన్నారు.[24]

ఈ విధంగా ఎందరెందరో ప్రాచీన కవులు తాము అవధానులమని స్పష్టంగా, స్వయంగా చెప్పుకున్నారు.

అన్నింటి కంటే ప్రాచీనతమంగా కనిపించే, "కవీభ వజ్రాంకుశుడు", "సరస్వతీ కర్ణావతంస" మనే బిరుదులున్న "నారాయణభట్టు" (క్రీ.శ. 1085)కు "అష్టాదశావధారణ చక్రవర్తి" అనే బిరుదు కూడా ఉన్నది.[25] 'అవధారణ' శబ్దంలోని 'ధారణ' మేధకు చెందిందే. అష్టావధానం – శతలేఖిన్యవధానం గురించి అనంతర కాలంలో ప్రాచుర్యం వచ్చినా, అంతకంటె ముందున్న ఈ 'అష్టాదశావధారణం' గురించి ఆలోచించ వలసిందే. "అవధారణము" శబ్దానికి శబ్దరత్నాకరములో 'నిశ్చయము' అని అర్థమున్నది.

నారాయణభట్టు

అష్టాదశ పురాణాలను ధారణ పట్టాడా? లేక
అష్టాదశ మహావిద్యలను ధారణ పట్టాడా? లేక

అష్టాదశ వర్ణనలలో ధారణాశక్తి చూపించాడా? లేక
అష్టాదశ భాషలలో ధారణ కలిగి ఉన్నాడా? లేక
అష్టాదశ విషయాంశాలలో ధారణ ఉన్నవాడా? అన్నది చర్చనీయాంశం.

ఎందుకంటె, నన్నయభట్టునకు "పాయక పాకశాసనికి భారత ఘోర రణంబు నందు నారాయణుడన్నట్లు" సహకరించిన నారాయణభట్టు ఎన్నో ప్రజ్ఞల సమాహారం. నన్నయకు భారతాంధ్రీకరణంలో తోడ్పడిన మేధావి. అటువంటి వానికి అష్టాదశ విద్యలతో పరిచయం ఉండడం సహజం. ఆయా విద్యలలో ఆయన సద్య స్సంశయ నివృత్తి చేయగల శక్తిగలవాడు. అష్టాదశ మహావిద్యలు ధారణలో ఉన్నవాడు. వాటిపై వివరణలు ఇవ్వగలవాడు. ఏది ఏమైనా ధారణాశక్తికి సంబంధించిన తొలి కవీంద్రునిగా 'నారాయణభట్టు'ని పేర్కొనవలసిందే.

అనంతర కాలంలో 'అవధానాలను' ధారణా సహితమైన ప్రజ్ఞలుగా గుర్తించారు. శ్రీ పళ్ళెపూర్ణ ప్రజ్ఞాచార్యులుగారు విజ్ఞాన సర్వస్వం 6వ సంపుటంలో అవధానం గురించి వ్రాస్తూ –

"అవధానములు ధారణా ప్రధానములు. ధారణ చిత్తైకాగ్రత వల్ల లభిస్తుంది"[26] అన్నారు.

చిత్తైకాగ్రం వల్ల అవధానంసిద్ధిస్తుంది. ఆ చిత్తైకాగ్రం వల్ల ధారణ కూడా సిద్ధిస్తుంది.

'అవధానం' ఒక శక్తిమంతమైన మానసిక స్థితికి సూచన. వ్యక్తి అవధాన స్థితిలో ఉన్నప్పుడు చేసేటటువంటి క్రియలన్నీ అవధానక్రియలే. ఈ అవధానాలు ఎన్నోరకాలుగా ఉండేవి. అందుకే పెద్దయామాత్యుడు చెప్పిన మాటలలో "ఎవ్వడే యవధానమెరుగు నయ్యవధానమున కించుక ముల్లుసూప" అని చెప్పుకున్నాడు.

ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసం లో గణపవరపు వేంకటకవి (క్రీ.శ. 1620–1660) ఇలా చెప్పాడు.

"అమితాశువు, మధురము చి
త్రము విస్తారము చతుర్విధ కవితలను జి
త్రముగను వింశత్యవధా
నము లన్ ఘటియించు లక్షణ కవివరుడన్".[27]



అంటే 20 రకాల అవధానాలతో చతుర్విధ కవితలను ఘటించగలడు. ఆశు–మధుర–చిత్ర–విస్తర కవితలలో 20 రకాల అవధానాలను గణపవరపు వేంకటకవి నిర్వహిస్తాడు. ఈతడు నిర్వహించే అవధానాలన్నీ సాహిత్యపరమైనవే అని అర్థం అవుతుంది. 17వ శతాబ్దంలో 20 రకాల అవధానాలు ప్రజా బాహుళ్యంలో ఉండేవి. 21వ శతాబ్దం నాటికి అవధానాలలో 50 రకాలు వచ్చాయి. ఆ వివరాలు అనంతర అధ్యాయంలో చర్చితమౌతాయి.

క్రీ.శ. 1850లో శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యుల వారు అవధానాన్ని సాహిత్యరంగంలో చక్కని నియమావళితో సలక్షణంగా నిర్వహించారు. ఆ తర్వాత తిరుపతి వేంకట కవులు అవధాన విద్యకు ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అయితే ఈ అవధాన విద్యకు మూలం 'వేదం'లో ఉన్నది.

## వేదావధానం - అష్టావధానం

భారత దేశంలోని లౌకికాలౌకిక విద్యలకు మూలస్థానం 'వేదం'. వేదమే సర్వవిజ్ఞానాలకు ప్రామాణికమని భారతీయులు భావిస్తారు. భగవంతుడు లేడని వాదించి సిద్ధాంతీకరించినా భారతీయులు సహిస్తారు కాని, వేద ప్రామాణ్యాన్ని అంగీకరించకపోతే మాత్రం నిరసిస్తారు. అలాంటి 'వేదం' పూర్వం మౌఖికంగానే సాగేది. లిఖితరూపంగా రచించడం నిషేధం. మౌఖికంగానే వేదం ఒక తరం నుంచి మరొక తరానికి అందించబడుతూ ఉంది. అలా జరిగే వేద ప్రసరణలో ఒక్క అక్షరం కూడా జారిపోకుండా ఉండేందుకు ఎన్నో శాస్త్రీయమైన పద్ధతులు పూర్వం వేద పండితులు అవలంభించేవారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. ఆ జాగ్రత్తలు వేదాధ్యయనంలో ఒక భాగంగా ఉండేవి. వైదికావధానాలలోనే స్వరావధానము, అక్షరావధానములు అనే ప్రక్రియలు ఉండేవి. తైత్తిరీయ ప్రాతిశాఖ్యంలో 'స్వరావధానవిధిః' అని ఇలా చెప్పారు.

### స్వరావధానవిధి

కనిష్ఠానామికామాద్యా తర్జనీషూత్తమేకరే
నీచస్వారధృతోదాత్తా నంగుష్ఠాగ్రేణ నిర్దిశేత్

స్వాద్యంత మధ్యమధ్యాసు తద్రేఖాసుచితాన్ క్రమాత్
పృథక్తంగులి స్థానం భక్తేయర్యం స్వర ఉచ్యతే
స్వార ముచ్చమివోర్థంచ హ్యానామికాన్తరాన్త్యయోః
స్వారకంపేస్వరావేతౌ వనామి కోత్తమాద్యయో
నిర్ది శ్చేదుచ్చకంపేచ తర్జనీ మధ్యమాద్యయో
పృథక్త దిష్టరేఖాస్యా దంగులీయోత్తరస్యహి
విరామేవ్యంజనస్యైవ పృథక్స్థానం నవిద్యతే
ఏవం హస్త స్వరన్యాసే కథితశ్చ వినిర్ణయః
సుహస్త స్వరవిన్యాసాన్ని ర్మలా ధ్యయనం భవేత్
తత్పూతో బ్రాహ్మణోయస్తు బ్రాహ్మణా సహ మోదతే.[28]

ఈ స్వరావధానంలో అంగుష్ఠ, తర్జని, మధ్యమ, అనామిక, కనిష్ఠ వేళ్లు నియమబద్ధంగా కదుపుతూ – ఉదాత్త, అనుదాత్త స్వరిత, ప్రచయ స్వరాలను సూచిస్తుండేవారు. వేదాన్ని పఠించేటప్పుడు స్వరానికి అనుగుణంగా వేళ్ల కదలిక ఉండేది. వేళ్ల కదలికలను సూచిస్తే స్వరాన్ని చెప్పడం, స్వరం ఆలపిస్తే వేళ్ల కదలికను చూపడం స్వరావధాన ప్రదర్శనలో ఉండేది.

'అలాగే అక్షరావధాన విధిః' అని ఈ విధంగా వివరించారు.

## అక్షరావధాన విధి

వేదంలోని అక్షరం ఉన్న స్థానాన్ని ధారణద్వారా గుర్తించడమే అక్షరావధానం. వేదంలోని కాండ సంఖ్య, అనువాక సంఖ్య, పాఠసంఖ్య, అక్షరసంఖ్య చెపితే ఆ అక్షరం చెప్పడం అక్షరావధానం. అలాగే అక్షరం చెప్పితే అది ఉన్న స్థానాన్ని గుర్తించడం కూడా అక్షరావధానంలోని భాగమే. దీనికి సంబంధించిన విధానం తైత్తిరీయ ప్రాతిశాఖ్యంలో ఇలా ఉంది : ఉదాహరణకు నవమ అనువాకంలో అక్షరావధానం ఇలా చేయవచ్చు.

ప్రతి పన్నములోను నవమ అనువాకమందు నాల్గవ అక్షరం ప్రకారం, "ఇషేత్వా" మొదలుకుని "గావోవై" వరకు '7' అష్టముల సంజ్ఞాక్షరములు ఇవి. ఏదో ఒక పనసలో ఇన్నో అక్షరము ఇది అని చెప్పి 'ఆ పనస ఏది' అని అడిగిన యెడల, ఆ సంజ్ఞాక్షరముల పనసల పూర్వాపరములను చూచి చెప్పుటకు సాధ్యము.



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఇ | స్వ | ప్యా | థ్యా | త్రం | తి | ల్బ | ప్యం |
| సు | ష్ణ | ద్రు | మ | హో | ఆ | స్థ | తా |
| వా | ని | ధ్వ | మ | ధ | గో | తి | రి |
| నం | మే | క్ష | ఏ | వై | వే | ద | వా |
| ప్లో | ది | వ | ఆ | శి | త్ర | య | గ్ని |
| స్తి | డ్వి | వా | వై.[29] | | | | |

'వేదాక్షరావధానం'లో పైన సూచించిన అక్షరాలు వేదం యొక్క పన్నాల మొదటి అక్షరాలు. అక్షరావధాని అక్షర సంఖ్యలను ధారణ చేయాలి. అప్పుడు ఆ పన్నాసంఖ్య చెప్పగానే ఆ అక్షరం గుర్తుకు రావాలి. అనంతరం ఆ పన్నాలోని అక్షరాన్ని గుర్తించి చెప్పవలసి ఉంటుంది. ఇదే విధంగా ప్రతి అనువాకానికి అక్షర సంపుటి ఏర్పాటు చేసికొని, ధారణ చేసికొని, వేదాక్షరావధానాన్ని నిర్వహిస్తారు.

వేదాధ్యయనంలో తీసికొనే జాగ్రత్తలు ఏమంటే.

1) స్వరం మారకుండా తీసుకునే జాగ్రత్తలు

2) పదం వరుస మారకుండా తీసుకునే జాగ్రత్తలు

3) అక్షరం మారకుండా తీసికొనే జాగ్రత్తలు.

ఈ విధంగా వేద పాఠపద్ధతులను చెప్పే గ్రంథాలు కూడా రచించారు. వాటినే ప్రాతిశాఖ్య గ్రంథాలంటారు. క్రమపూర్వకంగా వేదమంత్రాలను, వర్ణాలను పాఠం చేసే పద్ధతులు '8' ఉన్నాయి.

వాటి గురించి శైఖరీయ శాఖలో ఇలా చెప్పబడింది.[30]

"జటా, మాలా, శిఖా, ధ్వజ దండోరథోఘనః, అష్టో వికృతయః, ప్రోక్తాః, క్రమపూర్వామహర్షిభిః".

జటా, మాలా, శిఖా, ధ్వజ, దండ, రథ, ఘన ఈ ఎనిమిది వేద పాఠ భేదాలు.

ఇవి కాక సంహితాపాఠం, పదపాఠం, క్రమపాఠం ఎలాగూ ఉన్నాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=417**